క్లుప్తంగా

నేడు ద్విచక్ర వాహనాల వేలం

కాజీపేట: కాజీపేట ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల వివిధ కేసులలో పట్టుబడిన రెండు ద్విచక్రవాహనాలను బుధవారం ఉదయం 9 గంటలకు వేలం వేయనున్నట్లు సీఐ వేముల చంద్రమోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన కొనుగోలుదారులు ఎక్సైజ్ నిబంధనలకు అనుగుణంగా వేలంలో భాగస్వామ్యం పంచుకోవాలని కోరారు.

కార్మికులకు పీపీ కిట్ల పంపిణీ

కాజీపేట అర్బన్ : గ్రేటర్ వరంగల్ 31వ డివిజన్ కార్పొరేటర్ మామిండ్ల రాజు మంగళవారం మున్సిపల్ కార్మికులకు పీపీ కిట్లను పంపిణీ చేశారు. మున్సిపల్ కార్మికులు నగర పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని సూచించారు. వర్షాకాలంలో మున్సిపల్ కమిషనర్, నగర మేయర్ ఆదేశాల మేరకు పీపీ కిట్లను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్ అనిల్, జవాన్ పవన్ తదితరులు పాల్గొన్నారు.

'ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ చెట్లను తొలగించాలి'

వరంగల్ చౌరస్తా : వరంగల్ 12వ డివిజన్ దేశాయిపేటలోని ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాల చుట్టూ చెట్లు, పిచ్చిమొక్కలు మొలచి ప్రమాదకరంగా ఉన్నాయని వెంటనే చర్యలు చేపట్టాలని బీజేపీ వరంగల్ జిల్లా కార్యదర్శి గోకె వెంకటేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశాయిపేట అన్నీ రంగాల్లో వెనుకబడిందని, మంత్రి సురేఖ, కార్పొరేటర్లు, విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కరెంట్ ప్రమాదా వల్ల ప్రాణనష్టం జరగక ముందే అధికారులు తేరుకోవాలన్నారు.

జంక్షన్‌లో రైల్వే అభివృద్ధి పనులు ప్రారంభం

కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్ ప్రాంగణంలో మంగళవారం రైల్వే అధికారులు అభివృద్ధి పనులు ప్రారంభించారు. జంక్షన్ అమృత్ భారత్ స్టేషన్ స్కీం పునరాభివృద్ధి పనుల్లో భాగంగా రైల్వే టికెట్ బుకింగ్ కౌంటర్ కార్యాలయ సముదాయం ముందు అభివృద్ధి పనులు ప్రారంభించారు. స్టేషన్ సర్క్యులేటింగ్ ఏరియాలో స్టేషన్ భవనానికి సమీపంలో చేపడుతున్న అభివృద్ధి పనులు మోడల్ రైల్వేస్టేషన్‌కు న్యూ లుక్ సంతరించుకోనుందని రైల్వే అధికారులు తెలిపారు.

విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలి



అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న జాక్ నాయకులు

హన్మకొండ అర్బన్ : రాష్ట్ర వ్యాపంగా ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఉచిత బస్ సౌకర్యాన్ని కల్పించాలని ఉమ్మడి వరంగల్ జిల్లా బీసీ, ఎస్సీ, ఎస్టీ జాక్ ఇన్‌చార్జ్ డాక్టర్ చందా మల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హనుమకొండ జిల్లా బీసీ, ఎస్సీ, ఎస్టీ జాక్ ఆధ్వర్యంలో మంగళవారం హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జాక్ సభ్యులు మేకల సుమన్, భారతి, రాజన్న, రవీందర్, సురేష్ గౌడ్, జనార్ధన్, నాగరాజు, రత్నాకర్, యేసోబ్, మురళి కృష్ణ, సలీం పాషా, పాల్గొన్నారు.

ఇద్దరికి గాయాలు

హసన్‌పర్తి: బావిలో పూడిక తీస్తుండగా జరిగిన ప్రమాదంలో ఇద్దరు కూలీలకు గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలం సీతంపేటలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన భూపాల్ రైతు తన వ్యవసాయ బావిలో పూడికతీయడానికి మడిపల్లికి చెందిన ఎర్ర సుధాకర్, జనగాని రమేష్‌లను పనికి కుదుర్చుకున్నాడు. అయితే పూడిక తీయడానికి ఇద్దరు కూలీలు బావిలో దిగుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు బావిలో పడ్డారు. ఈ ఘటనలో వారికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌ద్వారా ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వారి పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

పోస్టర్ ఆవిష్కరణ



హన్మకొండ కల్చరల్ : తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో జేబీ కల్చరల్ ఆర్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్, తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్ కోసం సకల కళలు సంబురాల జాతర–2025 ఈ నెల 12, 13 తేదీల్లో వరంగల్ పోతన విజ్ఞాన పీఠంలో నిర్వహించనున్నారు. మంగళవారం హనుమకొండలోని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్‌లో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి కార్యక్రమ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

మా ఊర్లో కరెంట్ తీరే వేరు

- తరచూ విద్యుత్ అంతరాయం
- ఎప్పుడు వస్తుందో.. పోతుందో తెలియదు
- కడిపికొండ వాసుల ఆవేదన

కాజీపేట అర్బన్ : నేటి ఆధునిక యుగంలోనూ మా ఊర్లో కరెంట్ తీరే వేరు.. ఎప్పుడు పోతుందో ఎప్పుడు వస్తుందో తెలియదంటూ కాజీపేట మండలం కడిపికొండ గ్రామస్తులు వాపోతున్నారు. గతంలో మడికొండ సబ్‌స్టేషన్‌పై ఆధారపడిన కడిపికొండ గ్రామం ఇటీవల నూతనంగా సబ్‌స్టేషన్‌ను నిర్మించుకున్న కూడా తీరు మాత్రం మారడం లేదు అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ ఉన్నతాధికారులు నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని, విద్యుత్ సరఫరాలో బ్రేకప్ లేకుండా చర్య తీసుకోవాలని చెబుతున్నా కడిపికొండ గ్రామంలో



కడిపికొండ సబ్‌స్టేషన్

తీరు మారడం లేదు.

రోజుకు పలుమార్లు వస్తూ.. పోతూ..

కడిపికొండలో గంటలో పలుమార్లు నిమిషాల వ్యవధితో కరెంట్ పోవడం రావడం పరిపాటిగా మారిపోయింది. దీంతో అత్యవసర పనులకు విద్యుత్ ఉందా లేదా అంటు చూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఇంకా మారుమూల గ్రామాన్ని తలపిస్తున్న విద్యుత్ తీరు మారాలని స్థానికులు కోరుకుంటున్నారు.

రిపేర్‌కు వస్తున్న వస్తువులు



తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం చోటు చేసుకోవడంతో ఇంట్లోని వస్తువులు టీవీ, రిఫ్రిజిరేటర్, వాషింగ్ మిషన్, నీటి బోర్లు రిపేర్‌కు వస్తున్నాయి. విద్యుత్ నిరంతర సరఫరా చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– యాకూబ్‌పాషా, కడిపికొండ

అభివృద్ధికి రూ.1.40 కోట్లు మంజూరు

- రానున్న మూడేళ్లలో నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా
- వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్.నాగరాజు

హసన్‌పర్తి: 66వ డివిజన్ హసన్‌పర్తిలోని వీవీ కాలనీల్లో అభివృద్ధికి రూ.1.40 కోట్లు మంజూరు కాగా కార్పొరేషన్ సాధారణ నిధుల ద్వారా ఈ పనులు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. ఈసందర్భంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మంగళవారం ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న మూడేళ్లల్లో నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానన్నారు. గత ప్రభుత్వం విలీన గ్రామాలపై చిన్నచూపు చూసిందన్నారు. 42 గ్రామాలు కార్పొరేషన్‌లో విలీనమై 13 ఏళ్లు గడుస్తున్నా ఎక్కడి వేసిన గొంగడి అన్న చందంగా తయారైనట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు కనపర్తి కిరణ్, దేవస్థాన చైర్మన్ ఆరెల్లి వెంకటస్వామి, ఎన్ఎస్‌యుఐ జిల్లా మాజీ అధ్యక్షుడు వీసం సురేందర్‌రెడ్డి, దేవస్థాన మాజీ చైర్మన్లు జె.రవి, బల్సుకూరి శ్రీనివాస్, వింజమూరి వెంకటేశ్వర్లు, పెద్దమ్మ నర్సింహారాములు, జిల్లా కాంగ్రెస్ ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి గొర్రె కిరణ్, నాయకులు ,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే నాగరాజును సన్మానిస్తున్న నాయకులు

జాబ్ క్యాలెండర్ వెంటనే విడుదల చేయాలి

హన్మకొండ చౌరస్తా : కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర గడుస్తున్నా ఇప్పటి వరకు ఒక్క నోటిఫికేషన్ విడుదల చేయకపోవడంపై నిరుద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైఖరిపై నిరసన వ్యక్తం చేస్తూ మంగళవారం హనుమకొండలోని జిల్లా గ్రంథాలయం ఎదుట నిరుద్యోగులు రోడ్డు పై బైఠాయించి ఆందోళన నిర్వహించారు. ఎన్నికల ముందు ఖాళీగా ఉన్న ఉద్యోగాలను గుర్తించి ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి రాగానే మోసం చేశారని ధ్వజమెత్తారు. జాబ్ క్యాలెండర్ లో బాగంగా ప్రస్తుతం గ్రామ పంచాయితీ శాఖలో ఖాళీగా ఉన్న 7404 పోస్టులను డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా మాత్రమే భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణలోని తెలుగు మీడియం విద్యార్థులకు తెలుగు రాదంటూ అవహేళన చేస్తూ హైకోర్టులో జరిగిన వాదనలో న్యాయవాది నిరంజన్‌రెడ్డి వ్యాఖ్యలు నిరుద్యోగులను అవమానించడమే అన్నారు. గ్రూప్–1 నోటిఫికేషన్ రద్దు చేసి తెలుగు మీడియం అభ్యర్థులకు న్యాయం చేయాలని కోరారు.



ఆందోళన చేస్తున్న నిరుద్యోగులు

అధిక ఫీజులు నియంత్రించాలి



విద్యాశాఖ డైరెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న విద్యార్థి సంఘాల బాధ్యులు

విద్యారణ్యపురి : ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో అధిక ఫీజులను నియంత్రించాలని టీఎస్ఎఫ్, బీఎస్ఎఫ్, టీజీవీపీ, ఎమ్ఎస్ఎఫ్ విద్యార్థి సంఘాల బాధ్యులు హైదరాబాద్‌లో పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్‌కు వినతిపత్రం సమర్పించినట్లు ఆ సంఘాల బాధ్యులు సునీల్, రంజిత్, రాజేందర్ మంగళవారం తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక సదుపాయాలను కల్పించాలని కోరారు. వీరి వెంట ఆయా సంఘాల బాధ్యులు వంశీకృష్ణ, కోటనాగరాజు, ఎండీ. హసన్ పాల్గొన్నారు.

అనాథశ్రమంలో కడియం జన్మదిన వేడుకలు

హనుమకొండ: స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి జన్మదిన వేడుకలు కాంగ్రెస్ జిల్లా ఏసీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ ఆధ్వర్యంలో సర్క్యూట్ హౌస్ రోడ్డులోని స్పందన మానసిక వికలాంగుల కేంద్రంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ మాట్లాడుతూ కడియం శ్రీహరి దళితులకు నిత్యం వెన్నంటే ఉంటూ వారి అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నారు. పేద వర్గాలకు అందుబాటులో ఉంటూ కొన్ని దశాబ్దాల కాలం నుంచి రాష్ట్ర ప్రజలకు సేవలు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ శ్వేత, జిల్లా కాంగ్రెస్ రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ అరూరి సాంబయ్య, జిల్లా కాంగ్రెస్ నాయకులు జగన్ గౌడ్, అడ్వకేట్ మహేందర్, మేరీ సుకన్య, శ్రీనాథ్ యాదవ్ పరంజ్యోతి, రామకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్ పెరుమాండ్ల షాలిని ఎలిజబెత్ ప్రతిమ తదితరులు పాల్గొన్నారు.



స్పందన మానసిక వికలాంగుల కేంద్రంలో దివ్యాంగులతో పెరుమాండ్ల రామకృష్ణ

విద్యుత్ ఉద్యోగులు విధులు బహిష్కరించాలి



హన్మకొండ : నినాదాలు చేస్తున్న తెలంగాణ పవర్ ఎంప్లాయీస్ జేఏసీ నాయకులు



కేయూ క్యాంపస్ : పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వామపక్ష విద్యార్థి సంఘాల బాధ్యులు

హన్మకొండ: ప్రభుత్వం అనుసరిస్తున్న విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా బుధవారం విద్యుత్ ఇంజనీర్లు, ఆయా విభాగాల అధికారులు, ఉద్యోగులు విధులు బహిష్కరించి దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో పాల్గొనాలని తెలంగాణ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ ఇనుగాల శ్రీధర్, టీజీ ఎన్పీడీసీఎల్ బాధ్యులు బి.సామ్యా నాయక్, పి.మల్లికార్జున్ పిలుపునిచ్చారు. మంగళవారం హనుమకొండ బేతి కేశవ రెడ్డి కాలనీలోని ఇంజనీర్స్ గెస్ట్ హౌజ్‌లో పవర్ ఇంజనీర్స్ జేఏసీ టీజీ ఎన్పీడీసీఎల్ శాఖ సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలకు పాల్పడుతుందన్నారు. సమ్మెలో విద్యుత్ ఇంజనీర్లు, అకౌంట్స్ అధికారులు, పర్సనల్ అధికారులు, ఉద్యోగులందరూ విధులు బహిష్కరించాలని, నిరసన ప్రదర్శనలో పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు. సమావేశంలో జేఏసీ నాయకులు కె.రంగా రావు, జి.ప్రభాకర్ రెడ్డి, ఎస్.కుమారస్వామి, జె.హరి నాయక్, టి.కిరణ్, ఎం.అనిల్ కుమార్, పి.మహేందర్‌రెడ్డి, వి.హరిహర చారి, కె.శ్రీనివాస్, ఎ.శ్రీరాం నాయక్ పాల్గొన్నారు.

సమ్మెలో ఆర్టీసీ కార్మికులు పాల్గొనాలి

దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో ఆర్టీసీ కార్మికులు పాల్గొనాలని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సి.హెచ్.రాంచందర్ పిలుపునిచ్చారు.

ఎమ్మార్టీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

టీజీ ఎన్పీడీసీఎల్ ఎమ్మార్టీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (టీఎస్ఈఈయూ)–327 రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్ డిమాండ్ చేశారు. మంగళవారం వడ్డెపల్లి రోడ్‌లోని యూని యన్ కార్యాలయంలో ఆ యూనియన్ ఎన్పీడీసీఎల్ కంపెనీ స్థాయి కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సార్వత్రిక సమ్మెలో విద్యుత్ ఉద్యోగులందరు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సార్వత్రిక సమ్మెకు భారతీయ మజ్దూర్ సంఘ్, అనుబంధ సంఘాలు దూరంగా ఉంటాయని తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.శశికుమార్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తుందని యూసీసీఆర్ఐ (ఎంఎల్) ఉమ్మడి వరంగల్ జిల్లా సీనియర్ నాయకుడు ఇల్లందుల శోభన్ బాబు పేర్కొన్నారు.

కేయూ క్యాంపస్ : మోదీ ప్రభుత్వం 44 కార్మికచట్టాలను నాలుగు కోడ్‌లుగా విభజించి కార్మికులకు న్యాయమైన చట్టాలకు తూట్లు పొడుస్తున్నారని దీనికి నిరసనగా బుధవారం జరిగే కార్మిక సమ్మెను మద్దతుగా కాకతీయ యూనివర్సిటీ వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో సమ్మెను విజయవంతం చేయాలని మంగళవారం పోస్టర్లను ఆవిష్కరించారు. బుధవారం జరగబోయే సార్వత్రిక సమ్మె ను విజయవంతం చేద్దామని కేయూ టెక్నికల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ పుల్లా శ్రీనివాస్ పిలుపునిచ్చారు. సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని మద్దతుగా ఉపాధ్యాయ సంఘాల పోరాటకమిటీ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం హనుమకొండలో నిరసన ప్రదర్శన చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగ, కార్మిక ప్రజావ్యతిరేక విధానాలను నిరసనగా ఈ సమ్మె జరగబోతుందన్నారు. ఈ నిరసన ప్రదర్శన కాళోజీ విగ్రహం నుంచి అమరవీరుల స్తూపం వరకు కొనసాగింది.

న్యూశాయంపేట : కార్మికుల హక్కులను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కాలరాస్తుందని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తిరుపతి అన్నారు.

బీరన్న దేవాలయ హుండీ లెక్కింపు



ఖిలా వరంగల్ : వరంగల్ ఉర్సు బీరన్న దేవాలయం హుండీ లెక్కింపు మంగళవారం నిర్వహించారు. గత ఆదివారం తొలి ఏకాదశి పండుగను పురస్కరించుకుని బీరన్నబోనాల పండుగ సందర్భంగా హుండీ లెక్కింపు జరిపారు. లెక్కింపులో రూ.45,606 లభించాయని, అలాగే గౌడ సంతోష్, సౌమ్య దంపతులు బంగారు పుస్తెలు, మట్టెలు సమర్పించారని దేవాలయం చైర్మన్ మరుపల్ల రవి తెలిపారు. లెక్కింపు కార్యక్రమంలో ధర్మకర్తలు మిర్యాల కుమారస్వామి, మండల ప్రమీల, కోటేశ్వర్, గౌతం, అర్చకులు బలభద్ర భాస్కర్ పాల్గొన్నారు.

కళాశాలలో స్ఫూర్తి కార్యక్రమం

ఖిలా వరంగల్ : వరంగల్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం రంగశాయిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్ఫూర్తి కార్యక్రమాన్ని నిర్వహించారు, ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ డి. సంపత్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తెలంగాణ గ్రామీణ వికాస బ్యాంక్ ప్రతినిధి శివకుమార్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులు బ్యాంకుపై అవగాహన కలిగి ఉండి విద్య రుణాలు పొందడం, ఉన్నత విద్య అభ్యసించడానికి కావలసిన ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ గురించి, విద్య సదుపాయాల గురించి వివరించారు. ఆధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ వీరంజన్, విద్యార్థులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ ప్రతినిధుల ఆత్మీయ సమ్మేళనం

కాజీపేట : గ్రేటర్‌లోని 60వ డివిజన్ టీచర్స్ కాలనీలో భోగవల్లి రాజేశ్వర్‌రావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అనాథ పిల్లల ఆశ్రమంలో మంగళవారం రాత్రి రెడ్‌క్రాస్ సంస్థ ప్రతినిధులు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అనాథ పిల్లలకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ పి.విజయచందర్ రెడ్డి మాట్లాడుతూ పిల్లలు చక్కగా చదువుకుని వృద్ధిలోకి రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మేనేజింగ్ ట్రస్టీ పాపారావు, బొమ్మినేని పాపిరెడ్డి, ఈవీ శ్రీనివాస్ రావు, పుల్లూరు వేణుగోపాల్, బిల్ల రమణారెడ్డి, వెంకటేశ్వర్‌రావు, ప్రవీణ్, మౌనిక తదితరులు పాల్గొన్నారు.



అనాథ ఆశ్రమంలో రెడ్‌క్రాస్ ప్రతినిధులు

డ్రైవర్లు అప్రమత్తంగా లేకనే ప్రమాదాలు

- డీసీపీ ప్రభాకర్‌రావు



డీసీపీని సన్మానిస్తున్న ఆటో యూనియన్ నేతలు

కాజీపేట: రహదారులపై ట్రాఫిక్ నిబంధనలను డ్రైవర్లు సక్రమంగా పాటించకపోవడం వల్లే ప్రమాదాలు చోటు చేసుకుంటున్న విషయాన్ని గుర్తించి జాగ్రత్తగా మలుచుకోవాలని ట్రాఫిక్ డీసీపీ రాయల ప్రభాకర్‌రావు అన్నారు. పట్టణంలోని ఫ్యారడైజ్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఆటోడ్రైవర్లు, వాహనదారులకు రోడ్డు ప్రమాదాలపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సును జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ వా హనం బయటకు వచ్చే ముందు ప్రభుత్వం సూచించిన అన్ని పత్రాలు ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత డ్రైవర్లపైనే ఉందన్నారు. ప్రయాణికుల పట్ల మర్యాదగా మెలగాలని లేనిపక్షంలో ఇబ్బందులను ఎదుర్కొంటారని సూచించారు. సమావేశంలో ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, సీఐ వెంకన్న, ఎస్సైలు కనక చంద్రం, సంపత్, ఆటో యూనియన్ అధ్యక్షుడు దార సూరి, రాంబాబు, అంజాద్, శ్రావన్, వినోద్, రహీం పాల్గొన్నారు.

రీసెర్చ్ జర్నల్ ఆవిష్కరణ

విద్యారణ్యపురి : హనుమకొండలోని ప్రభుత్వ పింగిళి మహిళా కళాశాలలో రీసెర్చ్ జర్నల్‌ను కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి. రామచంద్రం ఆవిష్కరించారు. కళాశాలలో హిందీ, సంస్కృత విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన ఏ స్టడీ ఆఫ్ ఉమెన్ క్యారెక్టర్స్ ఇన్ రామాయణం అండ్ ఇట్స్ రెలవెన్స్ ఇన్ మోడ్రన్ ఎరా అనే అంశంపై నిర్వహించిన జాతీయ సదస్సులో సమర్పించిన పరిశోధనాత్మక వ్యాసాలతో కూడిన ఐఎస్ఎస్ఎన్ జర్నల్‌ను రిజిస్ట్రార్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కళాశాలలో ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తున్నారన్నారు.



రీసెర్చ్ జర్నల్‌ను ఆవిష్కరిస్తున్న రిజిస్ట్రార్ రామచంద్రం, అధ్యాపకులు

కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి చంద్రమౌళి, హిందీ, సంస్కృతం విభాగ అధిపతులు డాక్టర్ వి.మమత, కె రాజేశ్వరి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జిసుహాసిని, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ సురేష్‌బాబు, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.రమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రైమరీ స్కూల్‌ను తనిఖీ చేసిన కలెక్టర్

విద్యారణ్యపురి: హనుమకొండలోని బాసిత్‌నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మంగళవారం తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థుల ముఖ హాజరు తీసుకోకపోవటంపై సంబంధిత హెచ్ఎంను ప్రశ్నించారు. తాను రెండు రోజులపాటు సెలవులో ఉన్నందున తీసుకోలేదని చెప్పటంతో మిగతా టీచర్లలో ఎవరైనా కూడా తీసుకోవాలి కదా అని అడిగినట్లు తెలిసింది. తన సెల్ తోనే ముఖ హాజరు నమోదు లాగిన్ అయి ఉందని హెచ్ఎం చెప్పినట్లు సమాచారం. పాఠ్యపుస్తకాలు, స్కూల్ యూని ఫామ్, నోట్‌బుక్స్, వర్క్‌బుక్స్ అందాయా అనేది కూడా అడుగగా విద్యార్థులందరికీ పంపిణీ చేసినట్లు హెచ్ఎం చెప్పారు. రెండోతరగతి చదువుతున్న విద్యార్థికి ముఖ హాజరు తీయమనగా హెచ్ఎం ముఖ హాజరు తీయటంలో తడపడగా కలెక్టర్ తానే హెచ్ఎం సెల్ తీసుకొని తీసే విధానాన్ని చూపించారని సమాచారం. పాఠశాలలో మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించారు. కలెక్టర్ వెంట ఎంఈఓ నెహ్రూనాయక్ ఉన్నారు. అలాగే హనుమకొండలోని ఎంఆర్సీ సెంటర్‌ను కలెక్టర్ స్నేహశబరీష్ సందర్శించారు. సీఆర్పీలు జాబ్ చార్టు గురించి అడిగి తెలుసుకున్నారు. మండలంలోని పాఠశాలలకు పంపిణీ చేసిన పాఠ్యపుస్తకాలు, స్కూల్ యూనిఫామ్స్, వర్క్ బుక్స్ వివరాలు అన్ని ఆన్‌లైన్‌లో అప్‌డేషన్ అయిందా అని ఎంఈఓను అడిగారు. ఎంఆర్సీ సెంటర్ పక్కనే ప్రత్యేక అవసరాల పిల్లలకు విద్యను అందించే భవిత సెంటర్‌ను కూడా జిల్లాకలెక్టర్ సందర్శించారు. ఎంతమంది ప్రత్యేక అవసరాల పిల్లలున్నారని వారికి కల్పిస్తున్న సదుపాయాలను గురించి ఇన్‌క్లూసివ్ ఎడ్యూకేషన్ రిసోర్స్‌పర్సన్‌ను అడిగి తెలుసుకున్నారు.



విద్యార్థి ముఖ హాజరును పరిశీలిస్తున్న కలెక్టర్

వయోవృద్ధుల సంరక్షణ చట్టం అమలుచేయాలి

నయీంనగర్ : వయోవృద్ధుల సంరక్షణ చట్టం సమర్థవంతంగా అమలుచేయాలని వయోవృద్ధుల సంక్షేమ సంస్థ విద్యారణ్యపురి అధ్యక్షుడు దామెర నర్సయ్య, నాగులగాం నర్సయ్య, కార్యదర్శి తేరాల యుగంధర్ అధికారులను కోరారు.

చేవెళ్ల ఎస్సీ డిక్లరేషన్ అమలు చేయాలి

ఖిలా వరంగల్ : కొత్త ప్రభుత్వ ఏర్పడి 18 నెలలు పూర్తవుతున్న చేవెళ్ల ఎస్సీ డిక్లరేషన్ అమలు నోచుకోలేదని, అంబేడ్కర్ అభయహస్తం కోసం విధివిధానాలు తక్షణమే రూపొందించాలని డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

డాక్టరేట్ పొందిన టీచర్లకు సన్మానం

విద్యారణ్యపురి : హనుమకొండ ప్రభుత్వ మర్కజీ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల్లో నలుగురు డాక్టరేట్ పొందడం ఎంతో స్ఫూర్తిదాయకమని హెచ్ఎం జీవీ రామారావు అన్నారు.

హన్మకొండ: డాక్టరేట్ అందుకున్న బీఆర్ఎస్ 4వ డివిజన్ అధ్యక్షుడు కంజర్ల మనోజ్ కుమార్‌ను బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ సన్మానించారు.

ఘనంగా వైఎస్సార్ జయంతి వేడుకలు

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను గ్రేటర్ పరిధిలోని ఆయా డివిజన్లలో మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. మహానేత చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రధాన కూడళ్లలో కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అలాగే బాటసారులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సీఎంగా ఆయన చేపట్టిన సంక్షేమ పథకాలకు వివరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, కాంగ్రెస్ మండల, పట్టణ పార్టీల అధ్యక్ష, కార్య దర్శులు, ముఖ్యనాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి, నెట్‌వర్క్



కాజీపేట : కాజీపేట చౌరస్తాలో వైఎస్సార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



హన్మకొండ కల్చరల్ : పోచమ్మమైదాన్ సెంటర్‌లో ..



కాజీపేట అర్బన్ : పండ్లు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు



మడికొండ : కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



కాజీపేట రూరల్ : బాపూజీనగర్‌లో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు